



ఆ రోజు తరగతంతా కోలాహలంగా ఉంది. విద్యార్థుల పరిభాషలో నలుగు రైదగురు 'పకోడీ'ని మాత్రం మినహాయిస్తే మిగతావాళ్ళంతా గుంపులుగా చేరి అదే విషయం వింతగా చెప్పుకొంటున్నారు. వాళ్ళ ముఖాల్లో ఎక్కడలేని సరదా, సంతోషం తొంగి చూస్తున్నాయి. మరీ సంతోషం పట్ట లేని వాళ్ళు కేరింతలు కొడుతున్నారు. వారి కొందరు 'డెస్క్'లనే ఆర్కెష్ట్రాగా వినియోగించుకొంటూ సినిమా పాటలతో వాళ్ళ ఉత్సాహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడ బడితే అక్కడ ప్రత్యక్ష ఆ విషయంలో ప్రధాన పాత్ర తీసుకుంటు మవుతూ అందరనూ నవ్విస్తూ కవ్విస్తూ న్నాడు. రాజశేఖరం ఉరఫ్ రాజబాబు:

నిజానికి ఇటువంటి విషయాలలో పూర్తి వివరాలు సేకరించి పత్రికా విలేఖరిలా నిముషాల మీద ప్రచారం చెయ్యగల ప్రజ్ఞ ఆ తరగతిలో అతనొక్కడి సొత్తే. అందుకే విద్యార్థినుల దగ్గర నుండి ప్రధానోపాధ్యాయుని వరకు రాజబాబు అంటే తెలియనివారు లేరు. ఇక ఆ రోజు రాజబాబు డిమాండ్ మరీ ఎక్కువగా ఉంది. అతనెక్కడుంటే అక్కడికి విద్యార్థులు ఈగల్లా మూగి రకరకాల ప్రశ్నలు వేసి వివరాలు వింటున్నారు. రాజబాబు ఆ అమ్మాయి అందచందాలను గురించి లెక్చర్ దంచేస్తున్నాడు. అందరూ శ్రద్ధగా వింటున్నారు. ఇంతలో ఎక్కడ నుంచో కామేశం బాణంలా వచ్చిపడ్డాడు.

"ఒరేయ్! కోసెయ్యకురా అడ్డంగా—అసలు ఆ అమ్మాయి నీకెలా తెలుసురా?" రాజబాబు చేత మళ్ళీ ఓసారి సమగ్ర చరిత్ర చెప్పించాలని కామేశం అభిప్రాయం.

"అబ్బబ్బ! మళ్ళీ మొదలెట్టా వేంట్రా నువ్వెక్కడ దాపరించావురా బాబూ!" ఆయాసంతో ఓసారి నిట్టూర్చాడు రాజబాబు. అంతకంటే చేసేది లేక. కామేశానికి ఆ మాత్రం ఇంపార్టెన్స్ ఇవ్వకపోతే తన భరతం పడతాడు: అప్పుడప్పుడు క్లాసులు ఎగ్గొట్టి మాట్నీకి పోవాలంటే తనకు అప్పిచ్చేవాడు కామేశం మాత్రమే:

"డు వన్ థింగ్. అల్లరి చెయ్యకుండా ఎవరి స్థానాల్లో వాళ్ళు కూర్చోండి, మీకన్ని విషయాలు చెపుతాను," రాజబాబు మాట విన్నదే తడవుగా క్లాసంతా నిశ్శబ్దంగా కూర్చున్నారు—బహుశా ఏ మాష్టారి క్లాసులోనూ ఇంత వరకూ అంత నిశ్శబ్దంగా కూర్చోలేదేమో—ఎప్పుడైనా లీజర్ పీరియడ్స్‌లో సినిమా పాటలు పాడించుకొనేటప్పుడు తప్ప.

రాజబాబు టేబిల్ దగ్గర నిలబడి గొంతు సవరించుకున్నాడు. తన కండూతిని తీర్చుకోడానికి ఇటువంటి అవకాశాలను ఎప్పుడూ వృధాపోనీడు రాజబాబు. చదువులో ఎలాగూ రాణించడం లేదు. గనుక ఆర్థికంగా ఫరవాలేదు గనుక అదృష్టం కలిసి వస్తే భవిష్యత్‌లో ఏ మినిష్టరయినా అయితే 'ఇనీషియేటివ్' ఉండాలని అతగాడి దూరాలోచన కావచ్చు!

"మై డియర్ స్టూడెంట్స్! ఈ రోజు మనమంతా ఇంత ఉత్సాహంగా పండుగలా గడపడానికి కారణం ఓ శుభవార్త అన్న విషయం మీ అందరకూ తెలిసిందే. అంటే సహారా ఎడారిలా పైగా ఉన్న మన క్లాస్‌కి ఈ రోజు ఓ 'బ్యూటిఫుల్ కలర్' వస్తోంది. పాపం మరీ బాధపడిపోతున్నారు. ఈ 'పూర్ క్రీచర్స్' అని మీ అందరి మీద దయదలచి ఈ రాజబాబుగారు అంటే ఉడ్ బి మినిష్టరు గారు వాళ్ళ ఫాదర్‌కి ట్రాన్స్‌ఫర్ చేయించి ఈ ఊరు వేయించి ఆ అభినవ కౌముదిని ఈ క్లాసుకి పంపించారు. ఇప్పుడు వాళ్ళ నాన్నగారు మా నాన్నగారి ఆఫీసులో ఆఫ్టరాల్ ఎల్. డీ. సీ. గా పని చేస్తున్నారు. ఈ శుభవార్త మా డాడీ నాతో చెప్పగానే నేను మీ అందరితో చెప్పేశాను—నేను మంచోణ్ణేనా మరి! ఇంతకీ ఆ అమ్మాయి పేరు.... పేరు...."

గాజుల సవ్వడి అతని దృష్టిని గుమ్మం వైపు పిలిచింది. ఎదురుగా ఓ పదహారేళ్ళ అందమైన అమ్మాయి. రాజబాబుకి ముచ్చె

మట్లు పోసాయి. "యస్. యస్. ఎల్. సి. క్లాసు ఇదేనాండి?" ఆమె గొంతు మృదు మధురంగా పలికింది.

"అవునండి" రాజబాబు గొంతు తడబడింది.

ఆమె సరాసరి లోపలికివచ్చి ఓ ప్రక్కన ఖాళీగా ఉన్న బెంచీపై కూర్చుంది. అందరి దృష్టులు అటువైపే మళ్ళాయి.

"ఆ....చూడండి. మీరు కొత్తగా జాయిన్ అయ్యారని తెలిసి మీ గురించే మాట్లాడుకుంటున్నాం. దయచేసి మీ పేరు....?" ధైర్యాన్ని పుంజుకొని ఎంతో వినమ్రతగా అడిగాడు రాజబాబు.

"విశాలాక్షి" ఆమె సమాధానంతో రాజబాబుకి వెయ్యేనుగుల బలం వచ్చి హీరో పోజు పెట్టేశాడు.

"వెరీ గుడ్. మీ రాక మా అందరకూ ఎంతో సంతోష దాయకంగా ఉంది. బైది బై నా అసలు పేరు రాజశేఖరం. ఇంట్లో ముద్దుగా బాబు అంటారు. క్లాసులో అందరూ నా సెన్స్ ఆఫ్ హ్యూమర్‌ని రాజబాబు అన్నారు...."

అతని ఆత్మ పరిచయం పూర్తిగాకుండానే అంతా లేచి నిల్చున్నారు. "నీ క్లాసు అయిందంటే ఇహనే వస్తాను మరి" వస్తూనే ఆచార్యులవారు రాజబాబుపై విసిరేసారు.

"ఎంతమాట? మీ కోసమే గదండి ఇంతసేపు కుర్రాళ్ళకి క్రమశిక్షణ పాఠం చెప్పింది—చూడండి మరి ఎంత నిశబ్దంగా ఉన్నారో" న్యూటను మూడవ సూత్రాన్ని ఇటువంటి చోట్ల రుజువు చెయ్యడంలో రాజబాబుది అందె వేసిన చెయ్యి. తన స్థానంలో వెళ్ళి కూర్చున్నాడు.

"విశేషమే" అంటూ ఆచార్యుల వారు కుర్చీలో కూర్చోబోతూ యాదృచ్ఛికంగా విశాలాక్షి వైపు చూశారు. ఆమె నమస్కరించింది.

"ఏవమ్మా? ఏవైనా పనుందా?" కళ్ళజోడు సర్దుకుంటూ ఆమె వైపు పరీక్షగా చూసారు.

"కాదండి—నేనీ క్లాసులో చేరాను"

"ఏవిటి—క్రొత్తగా వచ్చి చేరావా? ఇది ఎస్. ఎస్. ఎల్. సి. తరగతి అని తెలుసా?"

ఆమె అవునన్నట్టు తలూపింది.

"ఏ ఊరినుండమ్మా వస్తా? మీ నాన్న




గారు ఉద్యోగస్థులా?''

"అవునండి—రాజమండ్రి నుండి ఈ ఊరు ట్రాన్స్‌ఫర్ అయింది.''

"మంచిదమ్మా—ఇహ కూర్చో.''

ఇంతలో ప్యూన్ వచ్చి అటెండన్స్ రిజిస్టరు ఇచ్చి వెళ్లిపోయాడు. ఆచార్యుల వారు అటెండెన్స్ తీసుకుంటున్నారు....

"....నెంబర్ ఫిఫ్టీన్'' సమాధానం లేదు. తలెత్తి చూశారు మాష్టారు.

"ఏమిటోయ్ ఎప్పుడూ ఆలశ్యమే ఇతను — ఆదర్శప్రాయుడైన నాయకుడన్నాడు.''

"క్షమించాలి మాష్టారూ—సైకిలు పాచీ పడింది. రేపటి నుండి రెగ్యులర్‌గా వస్తాను'' అప్పుడే గుమ్మం దగ్గర కొచ్చి నిల్చున్నాడు నవీన్—బ్లాక్ పాంట్‌పై లైట్ వైట్‌షర్టు నీటుగా ఇన్సర్టు చేసుకొని అందంగా పొడవుగా ఉన్న ఉంగరాల జుట్టు అబ్బాయి.

"సరే తప్పుతుందా?—రా లోపలికి. నాయకుడు లేంది కథ సాగుతుందా?''

"కాబోయే సినిమా నాయకుడండి,'' రాజబాబు జోక్ పేలింది. నవీన్ నవ్వుకుంటూ వచ్చి రాజబాబు పక్కగా కూర్చున్నాడు.

"పోనీలే. నీలా రాజకీయ వినాయకుడు కావాలనుకోవడం లేదు'' నిజానికి రాజబాబు చేత అతిగా వాగించడమంటే ఆచార్యుల వారికి ఎంతో ఇష్టం.

అటెండన్సు పూర్తయ్యే లోపల రాజబాబు నవీన్‌కి ఆ అమ్మాయిని గురించి తనకు తెలిసిన భోగట్టా యావత్తూ చెపుతున్నాడు.

"సైలెన్స్ ప్లీజ్!'' ఓ క్షణం తరగతి నిశ్శబ్దంగా ఉంది. అటెండన్సు వెయ్యడం పూర్తిచేసి ఆయన టెక్స్ట్ బుక్ తీసారు.

"ఇవాళ పొడుగు వెధవో, పొట్టి వెధవో, కంసాలో, కమ్మ—ఇలాంటి వాళ్లు వ్రాసినవి కాదు మనం చదువుకునేది. విశ్వకవి రవీంద్రుడు వ్రాసిన 'గీతాంజలి' నుండీ ఓ భాగం చదువుకో బోతున్నాం. గీతాంజలి నోబుల్ బహుమానం పొందిన గ్రంథం. ఈ పాఠం చాలా ఇంట్రెష్టింగ్‌గా ఉంటుంది. జాగ్రత్తగా వినండి....''

ఇదీ పాఠానికి ఆయన చెప్పే పరిచయ వాక్యాలు. ఏం చేస్తాడు? ఆయన బాధ ఆయనది. ఇంగ్లీషు భాష మీద అభిమానం లేకపోయినా, కనీసం ఇంగ్లీషు రచయితల పేర్లన్నా ఇష్టం లేకపోయినా పిల్లా జెల్లా గలోడు గనుక ప్రైవేటుగా, తేరగా వస్తున్న ఇంగ్లీషు **M. A** డిగ్రీ కాస్త పుచ్చుకున్నాడు—డిగ్రీలతో తెలివి కొలిచి ఉద్యోగాలిచ్చే దేశంలో పుట్టాడు ఆయన ఖర్మ కాలి ఉద్యోగం వచ్చేదేపదువైనా సరే అనుకున్నాడా రోజు—**M. A.** డిగ్రీ ఉంది గనుక చెప్పగలడా లేదా అనే ప్రశ్నకు తావు లేదు గాని ఈ రోజు అంతరాత్మని మాత్రం సమాధాన పర్చలేక ఈ అక్కసు—ఫలితాన్ననుభవించే విద్యార్థులు ఏం చెప్పినా ఎవరూ నమ్మరు!

"అన్నట్టు చూడమ్మా! మీ కింత వరకు పాఠాలయ్యేయా?''

"నాలుగు పాఠాలు కావాలం డింకా''

"అయ్యో! అర్థ సంవత్సర పరీక్షల్లో ఇక్కడ ఈ పాఠం వరకు ప్రశ్నలుంటాయే! అందుచేత ఓ పని చెయ్యి. స్టోరీలూ, నోట్సు, డిక్టేట్ చేశాను. కాస్త బాగా నోట్సు వ్రాసిన వాడి దగ్గర తీసు

పమిట: సినిమాతారలు కొద్దిగా జారవిడవడానికి వేసుకొనేది.

కొని వ్రాసుకో'' ప్రతీ మాష్టారులాగే పాపం ఆయన కూడా పరీక్షల దృష్ట్యా 'క్లూ' ఇచ్చాడు.

''అలాగే నండి.''

''పాపం ఇంకెవ్వరూ అమ్మాయిలు లేకపోవడం కాస్త చిక్కుగానే ఉంటుంది నీకు'' ఆచార్యుల వారి సానుభూతి.

''అదేమిటి మాష్టారూ? — ఆమె మాత్రం ఈ క్లాసులో స్టూడెంట్ కాదా? విద్యార్థినులు లేకపోయినంత మాత్రాన ఆమెను వెలివేసినట్టు చూస్తామా? ఆమెకు కావలసిన నోట్సులన్నీ నేనిస్తాను. ఒక విద్యార్థి క్రొత్తగా జాయిన్ అయితే మా సహకారం ఉండదా? మా స్నేహితుడు కాడా? అలాగే ఈమె కూడా. దీనికి స్త్రీ పురుష భేదాలేమిటి? ఇరవయ్యో శతాబ్దంలో కూడా మీరిలా మాట్లాడ్డం ఆశ్చర్యంగా ఉంది''

నవీన్ ప్రసంగంతో క్లాసులో గుసగుసలు చెలరేగాయి. చాల మంది అతని వైపు హేళనగా చూశారు. 'కాకా' 'పోట్' 'హీరో' ఇత్యాదిపదాలు వారి గోల నుండి అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

''నీ ఆదర్శాల పట్ల నాకు సందేహం లేదనుకో—కాని చూడు. నీ మిత్రులిప్పుడే ఎలా యాగీ—చేస్తున్నారో.''

''పోనివ్వండి. ఎవ్వరేమనుకున్నా నేను భయపడను. నేను చేస్తున్నది మంచి పనే 'అనే' విశ్వాసం నాలో ఉన్నంత కాలం నేనెవ్వరినీ లెక్కచెయ్యను.''

క్లాసులో మళ్ళీ ఒకసారి గొడవ ఎక్కువైంది. 'సంస్కర్త' 'ఆదర్శవాది' మొదలైన పదాలు ఎంత మెల్లిగా ప్రయోగించబడినా అతనికి మాత్రం కర్ణకఠోరంగానే వినిపించాయి. 'సైలెన్స్ ప్లీజ్' అని ఆయన టేబుల్ తట్టేసరికి మళ్ళీ ఓ క్షణం క్లాసులో నిశ్శబ్దం ఆవరించింది. పాఠం మొదలు పెట్టారు. పూర్తి కాకుండానే గంట మ్రోగింది' ఆచార్యుల వారు వెళ్ళిపోయారు. నవీన్ వచ్చి టేబిల్ దగ్గర నిల్చున్నాడు. ఇంక రెండవ పీరియడ్ మాష్టారు రాలేదు. ఆమె వెళ్ళిపోలేదు గరల్స్ 'వెయిటింగ్ రూం'లోకి. విద్యార్థులంతా ఆమెకేసి విచిత్రంగా చూశారు. ఆమె ఘటికురాలని కొందరి అభిప్రాయం—కాదు, వెయిటింగ్ రూం ఉందని తెలియక వెళ్ళలేదని మరికొందరి

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు !
DOL 327/1 TO

వాదం. ఐదు నిముషాలయింది. మాస్టారింకా రాలేదు. కనీసం నవీన్ అయినా వెయిటింగ్ రూమ్ ఉందని ఆమెతో చెప్ప లేదని ఆశించారు కొందరు. అవకాశం తీసుకొని ఆమెతో బాతాఖానీ కొడతాడని అనుకున్నారు మరి కొందరు. కాని ఎవరి అంచనా నిజం కాలేదు. అతను బోర్డు దగ్గరకు వెళ్లి డస్టర్‌తో శుభ్రంగా తుడిచి తరగతి పేరు, తేదీ వ్రాశాడు ఓ మూల. బోర్డు వైపు అప్రయత్నంగా చూసింది విశాలాక్షి. తిలక్ కవిత తనలో తనే మననం చేసుకుంది.

"నా అక్షరాలు వెన్నెలలో ఆడుకొనే అందమైన ఆడపిల్లలు.

నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు...."

అతని అక్షరాలు చూస్తుంటే తనకు సాహిత్యాభిరుచి ఉంది గనుక ఆ పంక్తులు స్ఫురించాయి గాని ఇక్కడ అన్వయమేమిటి అని ఆశ్చర్యపోయిందామె. ఏమైనా అతని అక్షరాలుమాత్రం అందంగా ముత్యాల సరాల్లా ఉన్నాయి. ఆమె కళ్ళు బోర్డు మీద అక్షరాలను ఉద్రేకంగా చూస్తున్నాయి. చాల మంది కళ్ళు మాత్రం ఆమె మీద ఉన్నాయి. కృష్ణమూర్తి మాస్టారి రాకను ఎవరూ గమనించలేదు. ఆయన వచ్చి కూర్చోవడంతో అందరూ పిడ బాటుతో లేచి నిల్చున్నారు. నవీన్ పోయి తనస్థానంలో కూర్చున్నాడు. కృష్ణమూర్తికీ తనకూ సరిపడదు.

"ఈ పీరియడ్ మీది కాదండీ మాస్టారూ" రాజబాబు హెచ్చరిక.

"నాకు తెలుసు—నువ్వు చెప్పక్కర్లే. సోషలు మాస్టారు రమణా రెడ్డిగారు సెలవు పెట్టారు. లాస్ట్ అవర్ ఎలాగూ లేదు గనుక థర్డు అవర్ కూడా విడిచి పెట్టేస్తాను."

అందరి ముఖాల మీద సంతోషం ఫేస్ పౌడర్‌లా మెరిసింది.

"థాంక్యు మాస్టారూ" అందరి అభిప్రాయాలనూ 'రిప్రజెంట్' చేశాడు రాజబాబు. అందరు కూర్చున్నారు. తను 'సిట్ డౌన్' అనకుండా కూర్చున్నారని కృష్ణమూర్తి బాధ—పాపం ఏం చేస్తాడు. ప్రజాస్వామ్యలక్షణాలు జీర్ణించుకుపోయిన విద్యార్థులు! అక్కడనే ఇటువంటి చిన్న విషయాలకు పట్టించుకుని తరచుగా విద్యార్థులతో తగాదా పడటం ఆయనకు పరిపాటే.

'ఎపొలీనియస్ థీరమ్' ఆ రోజు చెప్పిన పాఠం. సాధారణంగా మధ్యలో ప్రశ్నలు వేసే వారిని చూస్తే ఆయనకు విసుగు. విద్యార్థులకు ఆయనంటే వెగటు. మొత్తం మీద పాఠం అయిపోయింది. అర్థం కానివాళ్ళను లేచి నిల్చోమన్నాడు. ఎవ్వరూ లేవలేదు—విశాలాక్షి, నవీన్ తప్పిస్తే. కృష్ణమూర్తి విశాలాక్షి వైపు చూశాడు.

"కొత్తగా చేరావు కదూ? పేరు — విశాలాక్షి అవునా?" ఆమె తలూపింది.

"సరే కొత్తకదూ, కొంచెం గాబరాగా వుంటుంది, అయినా పాత సిద్ధాంతాలు కూడా తెలిస్తేగాని ఇది బోధపడదు. ఖాళీ అయినప్పుడు నేను వేరే చెప్తానులే నీకు."

"థాంక్స్" ఆమె కూర్చుంది.

"నీకు బోధపర్చాలంటే దేవుడు దిగి రావాలి—కూర్చో" అపహేళనగా నవీన్

వైపు చూశాడు.

"మీకు భయపడిగాని నిజంగా ఎంత మందికి అర్థమయిందో చెప్పమనండి చూద్దాం."

నవీన్ సవాలే అంగీకరించి కృష్ణమూర్తి ఒక్కొక్కరినీ అధీకమ్ గురించి అడిగాడు. క్లాసుకి సగంపైగా లేచి నిల్చున్నారు.

'సరే నీ పన్నాగం తెలిసింది. నన్ను ఇన్సల్ట్ చెయ్యాలని నీఉద్దేశం. మీరందరూ ఈ సిద్ధాంతం గడగడా చెప్పేవరకు ఈ క్లాసుకి తిరిగిరాను," అలనాటి అర్జునుడిలా ఓ భీషణ శపథం చేసి ఆయన కోపంగా లేచి వెళ్ళిపోయాడు. కొంత మంది అవకాశవాదులు ఆయన వెనుక వెళ్ళారు, రాగా పట్టడానికి ఇదే అదనని.

అందరూ వెళ్ళిపోతున్నారు. ఆమె లేచి నవీన్ వైపు చూసింది.

"ప్లీజ్ మీ ఇంగ్లీషు నోట్సు ఉంటే..'

ఆమె వాక్యం పూర్తి గాకుండానే నోట్సు తీసిచ్చాడు, నాటకానుభవాన్ని పురస్కరించుకుని కట్ డైలాగ్స్ బాగా తెలుసుండాలి నవీన్‌కి.

"సందేహించకండి. మీకేం కావలిసినా అడగండి."

"థాంక్స్" ఆమె వెళ్ళిపోయింది.

క్లాసంతా ఎర్రగా చూశారు. వరండాలో స్కూలు రోమియోలు ఆమె వైపు వెర్రిగా చూశారు.

"గురూ; చాలా అందమైన అమ్మాయి...."

"అంటే నీ ఉద్దేశ్యం'" రాజబాబు మాటను మధ్యలోనే కట్ చేశాడు నవీన్.

"ఆహా! - అదికాదు. మనకి పిస్టర్ లభించడం ఎంతైనాగర్వకారణం"అంటూ నవీన్ చెయ్యినొక్కాడు రాజబాబు-ఇద్దరూ నవ్వుకుంటూ స్కూలునుండి బయటకు వచ్చారు.

. . .

నాలుగురోజులు గడిచాయి. తరగతి వాతావరణంలో ఆ నాలుగురోజుల్లోనూ చాలా మార్పొచ్చింది. క్లాసులో రెండు వర్గాల మధ్యఉన్న వైషమ్యాలు మాత్రం తీవ్రమయ్యాయి. నవీన్‌కి విశాలాక్షికిఉన్న పరిచయాన్ని పురస్కరించుకొని రకరకాల కధలు సృష్టించి ప్రచారం చేస్తున్నారు ప్రతి పక్షంవారు. దానికి కృష్ణమూర్తి మద్దత్తు కూడా పరోక్షంగా ఉన్నట్టు చూచాయగా తెలిసిందని నవీన్‌కి రాజబాబు తీసుకొచ్చిన రాజావార్త. విశాలాక్షి ఇంగ్లీషు నోట్సు ఇచ్చేసి మళ్ళీ రెండునోట్సులు తీసుకెళ్ళింది. కేవలం నవీన్ నోట్సులే తీసుకెళ్ళడంలోని అంతర్యం గురించి క్లాసులోఅప్పుడప్పుడూ ప్రతి పక్షంవారు పరోక్షంగా విసురుతున్న శరపరంపర విశాలక్షికి తగులుతున్నా ఆమె పట్టించుకున్నట్టులేదు, బహుశా ఆమె మనస్సుకేదో లోహిత కవచం ఉండి ఉండాలి!

ఆ రోజు లాస్టు పీరియడ్ తెలుగు. ప్రసంగవశాత్తు పాఠం వదిలిపెట్టి ఆధునిక సాహిత్యం గురించి మొదలుపెట్టారు తెలుగు మాష్టారు గోపీనాధరావు. అడపా తడపా పత్రికల్లో ఆయన రచనలు అచ్చవుతుంటాయి. ఆ విషయాలపై విశాలాక్షి

---

● దగ్గిర వస్తువులు సరిగ్గా కనిపించక బాధపడే ఒక మిణుగురు పురుగు ఎవరో పారేసిన సిగరెట్టు పీకని పెళ్ళిచేసుకున్న సంగతి మీకు తెలుసా?

కనబర్చిన ఆసక్తిని చూసి అభ్యుదయ కవిత్వం గురించి, వచన కవిత గురించి, ఆధునికకవితా సంపుటాలపైన ఆమెతో చర్చించారు. ఆమె సాహిత్య జ్ఞానానికి ముచ్చటపడి ఆమె ఆ రంగంలో తప్పక రాణించగలదని అందుకు తనేవిధంగా సహకరించగలిగినా సంసిద్ధుడననీ చెప్పారు. ఈ సంఘటనకు అమితంగా సంతోషించిన వారిలో నవీన్ ముఖ్యుడు. ఆమెపై తనకున్న అభిప్రాయాలకు ఈనాడు తెలిసిన విషయాలు దోహదం చేసి తన అభిమానాన్ని రెట్టింపు చేశాయి. ఇంతలో 'లాంగ్‌బెల్' అయిపోయింది. విశాలాక్షితో అప్పుడప్పుడూ తనకు కనపడుతుండమని చెప్పి గోపీనాథరావు వెళ్ళిపోయాడు. ఆమె పుస్తకాలు తీసుకొని పైకిలేచింది. ఎవరో పిల్చినట్లయింది. వెనుదిరిగి చూసింది. నవీన్ ఆమెకోసమేనన్నట్టు నిల్చున్నాడు, రాజబాబు, నవీన్ తప్పిస్తే అందరూ వెళ్ళిపోయారు.

"పిల్చారా" ఆమె దగ్గరగా వచ్చింది.

"మీరు మరో విధంగా భావించకపోతే రెండు క్షణాలు మాట్లాడాలి" నవీన్ ఆమె ముఖంవైపు చూశాడు. ఆమె ముఖంలోని నైర్మల్యం అతన్ని ముగ్ధుణ్ని చేసింది.

"దానికేం మాట్లాడండి. మీవంటి ఆదర్శవాదులతో పరిచయం కలగడం నా అదృష్టం" ఆమె కలుపుగోలుతనం అతన్ని విచలితుణ్ని చేసింది.

"మరేంలేదు. ప్రొద్దుట నాకు తిరిగిచ్చిన సైన్సు నోట్సులో మీ కవిత 'ఉషస్సు' మర్చిపోయారు. అప్పుడప్పుడూ విశాలాక్షి పేరుతో ప్రచురింపబడుతున్న రచనలు మీవేనని ఊహించాను. అదృష్టవశాత్తు ఈనాడు తెలుగు పీరియడ్‌లో జరిగిన సంభాషణ నా నిర్ణయం నిజమేనని రుజువు చేసింది. ఇంతకీ ఆ రచయిత్రి విశాలాక్షి మీరేనా? దయచేసి చెప్పండి."

"అంత పెద్ద పదానికి అర్హురాలిని కాకపోవచ్చు. కాని అభిరుచిని చంపుకోలేక అప్పుడప్పుడు ఆ పేరుతో రచనలను చేస్తున్నది మాత్రం నేనే."

"తక్కువగా చేసి చెప్పుకోవడం గొప్పకాదు - క్షమించండి. కాస్త సూటిగా మాట్లాడే స్వభావం నాది మీరన్యథా భావించకపోతే ఓ సలహా. చూడండి మీ రైటింగ్ అసలు బాగుండలేదు. పత్రికలవాళ్ళకి అంత ఓపిగ్గా చదవడం వీలుకాదు గనుక త్రోసివేస్తుంటారు. అందుచేత ఇక్కడున్నంతకాలం నేను ఫెయిర్ చేసి ఇస్తుంటాను. ఈ కవిత రేపు ఇస్తాను."

"థేంక్స్! నేనే మిమ్మల్నా సహాయం చెయ్యమని అడుగుదామనుకున్నాను"

'చూడండి ప్రతీ చిన్న విషయానికి ఆత్మీయుల మధ్య థాంక్స్‌లు, నోమెన్షన్లు నాకు నచ్చవు - అది కేవలం దూరాన్ని పెంచుకోడానికే. ఇకపోతే మిమ్మల్ని చూసిన తర్వాత విశాలాక్షికంటె విశాల అంటేనే బాగుంటుందేమో అనిపించింది. మీకభ్యంతరం లేకపోతే ఇకనుంచి విశాల అనే పేరుతోనే రచనలు పంపిస్తుంటే సంతోషిస్తాను. మిమ్మల్ని చూసిన మొదటి రోజు మీ పేరు తెలియకుండానే విశాల అంటే బాగుంటుందనుకున్నాను, అదృష్టవశాత్తు మీ పేరు దగ్గరగానే వచ్చింది."

" పేరు గురించి నేనంత పట్టించు

కోలేదు - అయినా మీ సలహాని పాటి స్తాను.''

"థాంక్స్' చెప్పనుమరి! అన్నట్టు నా పేరు గురించి చెపితే ఆశ్చర్యపోతారను కుంటాను, అసలు పేరు నరసింహ వీరవెంకట సాగవర్ధన్ - నా కిష్టంలేక నవీన్ అని మార్చుకున్నాను. మీ భావాలు ప్రవర్తన నా అభిరుచులకు సరిగ్గా సరి పోయాయి. మీతో స్నేహం చెయ్యాలనీ, ఎప్పటికీ ఆత్మీయులుగా ఉండాలని నా కోరిక.''

"వింతగా మాట్లాడుతారు మీరు - మనమిప్పుడు స్నేహితులంకాదా?

"థాంక్స్' వస్తామండి మరి'' రాజ బాబు కంగారుగా భరతవాక్యం పలికాడు. ఇద్దరూ కరచాలనం చేశారు వెళ్ళిపోతూ. రాజబాబు కంగారు పడ్డానికి హెడ్మాష్టరు నరసింహారావుగారు వరండాలోంచిపోతూ తమవైపు తీక్షణంగా చూడ్డమే కారణ మని నవీన్ గ్రహించలేదు. బయటికి వస్తుంటే ప్రతిపక్షవర్గం నాయకుడు బసవ రాజు ఆదృశ్యంలో వేయబడుతున్న ఈలలు మాత్రం వినిపించాయి.

మరుసటిరోజు స్కూలు గోడలనిండా కొట్టవచ్చేలా కనపడినవి 'బ్లాక్ అండ్ వైట్ నిషా కుషీ' అనీ 'నిషా హీరో' అని ఇంకా రకరకాల వ్రాతలు ఎప్పుడూ బ్లాక్‌పాంట్, వైట్ షర్టు వేసుకొని నీట్‌గా ఉండడం చూచి సహించలేక తనతో పోటీచేసి ఓడిపోయిన బసవరాజు తనకి 'బ్లాక్ అండ్ వైట్' అనే నిక్ నేమ్ పెట్టి ప్రచారం చేసినట్లు నవీన్‌కి తెలుసు, 'నిషా' అనే పేరు విశాలకిచ్చిన టైటిల్ అని అతను సులువుగానే గ్రహించగలిగాడు. మాష్టర్లతో సహా అందరికీ తెలిసిపోయింది ఈ వార్త. తర్వాత ఎప్పుడో హెడ్మాష్టరు అవి చెరి పించి వెల్ల వేయించారు, స్కూలు వార్షికోత్సవం వస్తుందనగా.

ఈ లోపుగా చెప్పుకోదగ్గ విశేషాలు మాత్రం జరిగాయి, విశాలాక్షి రచనలు ఒకటి రెండు విశాల పేరుతో అచ్చయి నాయి ఆమె రచయిత్రి అని అందరికీ తెలిసిపోయింది. ఒక కథలో ఆమె పెట్టిన కథానాయకుడి పేరు నవీన్ గురించి తమ ఊహ నిజమేనని దృఢపర్చు కున్నారు విద్యార్థి సోదరులు. కొంతమంది ఉపాధ్యాయులు కూడా ఈ విషయంలో విద్యార్థులతో ఏకీభవిస్తున్నట్లు ఇన్ఫర్ మేషన్ బ్యూరో రాజబాబు తీసుకొచ్చిన వార్త. ఇక అర్ధసంవత్సరం పరీక్షల్లో లెక్కలు పరీక్షలో మంచిమార్కులు రాలే దని విశాలాక్షికి ప్రైవేటు చెపుతానన్నాడు కృష్ణమూర్తి: ఆమెకంతగా ఇష్టంలేక పోయినా ఆమె తండ్రి సుబ్బారావుని కలుసుకొని ఆమె అంటే తనకభిమాన మని. చెల్లాయికంటే ఎక్కువగా చూసు కుంటానని చెప్పాడు. నవీన్ విశాలల సంబంధాన్ని చూచాయగా మాటల సంద ర్భంలో వ్యక్తంచేసి కాస్త విశాలను మందలించమని చెప్పాడు. ప్రస్తుతం కృష్ణమూర్తి దగ్గరకు విశాల ప్రతిరోజు

---

● ఫ్యాక్టరీని తనిఖీ చేయడానికి వచ్చిన ఇన్స్పెక్టరు మేనేజరుతో:
"మీ ఫ్యాక్టరీలో ఎంతమంది పనిచేస్తున్నారండీ?''
మేనేజరు: "సగం మందండీ''

సాయంకాలం ట్యూషన్‌కి వెళ్తోంది.

స్కూలు వార్షికోత్సవాలలో తన నాటికలో విశాలచేత వేషం వేయించడానికి నవీన్ నిశ్చయించుకున్నాడు. ఆమె అంగీకరించింది. తెలుగు మాష్టారు గోపీనాధరావు ప్రోత్సహించాడు. కాని హెడ్మాష్టరు నరసింహారావుగార్కి ఈ విషయం తెలిసేసరికి ముక్కున వ్రేలేసుకొని స్కూలులో ఇంతవరకు ఇటువంటి ఘోరాలు జరగలేదని స్కూలు చరిత్రకే మచ్చ తెస్తున్నావని నవీన్‌కి మొఖం వాచేలా చివాట్లు పెట్టి మరీ పంపించాడు. ఆయనకు నవీన్‌పై మరీ అంత దురభిప్రాయం కలగడానికి కారణం అవకాశమొచ్చినప్పుడల్లా కృష్ణమూర్తి నవీన్‌పై చేసే దర్భోధ అన్నవార్త రాజబాబు ముందే సేకరించాడు. ఆ సంవత్సరం నాటికల పోటీలలో నవీన్ పాల్గొనలేదు. బసవరాజు నాటిక ఒకటే ప్రదర్శింపబడింది. ఏదో సామెతలా అతడే ఉత్తమ నటుడు. ఇంటర్వెల్ ప్రాంతానికి కష్టాలన్నీ అమాంతంగా చుట్టుముట్టేసి ప్రేక్షకుల సానుభూతికిమాత్రం నోచుకునే డీలా పడిన సినిమా హీరోలా ఉన్న నవీన్ స్కూలు గొడవల్లో జోక్యం కలిగించుకోవడం మానేశాడు.

• • •

"ఓ విచిత్రమైన అబ్బాయి అభ్యుదయం. ఆదర్శం అంటూ కాస్త ప్రవాహానికి ఎదురుగా పోయే రకం. సరే కథ మొదలయింది మరో అమ్మాయి రాకతో. ఆమెగారు రచయిత్రట. వీళ్లిద్దరూ కలిసి చనువుగా తిరుగుతుండడం నాకూ తెలుసు. వాళ్లిద్దరూ కలిసి ఏదో నాటకం కూడా వేస్తామన్నారు. దానికి నేను సుతరామూ ఇష్టపడలేదు. సరే ఆ తర్వాత వాళ్ళ గురించి నాకు చాలా తెలిశాయి. వాళ్లిద్దరూ ప్రేమించుకున్నారని మేష్టర్లతో సహా చెప్పుకుంటుంటే విన్నాను. నాకు కూడా ఆ అనుమానముంది. ఏమైనా కాలం మారిపోయింది. ఏ విద్యాసంస్థల్లో చూసినా ఈ ప్రేమకథలే - ప్రేమించానసే పదం తేలికైపోయిందీకాలం యువతీ యువకులకు. తీరాచూస్తే వట్టి పిరికివాళ్లు. మొత్తంమీద ఈ విషయం అమ్మాయి నాన్నవరకు వెళ్ళింది. అతనేమో మా అమ్మాయిని అల్లరిపాలు చేశావు పోనీ పెళ్ళి చేసుకోమని అడిగాట్ట ఆ అబ్బాయిని. అతనేమో ఆమెను తనసలాంటి దృష్టితో చూడలేదని వాళ్ళనుబంధమేదో పవిత్రమైందని తప్పించుకున్నాట్ట వాళ్ళిద్దరి ప్రేమాయణాన్ని గురించి వర్ణిస్తూ వచ్చిన నాలుగయిదు ఆకాశరామన్న ఉత్తరాలు తీసుకొచ్చి ఆ అమ్మాయి తండ్రి ఇప్పుడా కుర్రాణ్ని స్కూలునుండి బయటికి పంపించకపోతే ఆ అమ్మాయిని మానిపించి తనకు చేతనయినదేదో చేస్తానంటాడు. ఆ అమ్మాయి నడిగితే అతను నిరపరాధి అని అన్నయ్యకంటె ఎక్కువగా భావిస్తున్నానని చెప్తుంది. పైగా ఆ అబ్బాయి తాను ఆ అమ్మాయిని చెఱచబోయినట్టు పుకారు పుట్టించాడని కృష్ణమూర్తి మాష్టారి ఫిర్యాదు. ఆ అబ్బాయికి రేపటిలోగా టి.సి. ఇవ్వకపోతే మేష్టర్లచేత సమ్మె చేయించేస్తాడట. ఈ పరిస్థితుల్లో నాకేం చెయ్యాలో పాలుపోవడంలేదు కాంతా" సాయంకాలం సతీమణి దగ్గర తన సమస్య చెప్పుకుంటున్నారు హెడ్మాష్టరు నరసింహారావుగారు.

"నాకు ఆ అబ్బాయి తెలుసు. నవీన్ కదండీ పేరు - చాలా మంచివాడండి పాపం కృష్ణమూర్తి మాష్టారే మంచివారు కాదట నిజం తెలియకుండా ఆ అబ్బాయి కన్యాయం చెయ్యకండి."

"ఏమైనా ఆడదానివనిపించావు. పైగా నిన్న గొడవ జరిగిన తర్వాత మళ్ళీ ఆ అబ్బాయి స్కూలుకు రాలేదు."

"అయ్యో పాపం - ఏ అఘాయిత్యమైనా చెయ్యలేదుకదా?"

"అంత పిరికివాడనుకోనుగాని ఈ పరిస్థితుల్లో అతనికి టి. సి. ఇచ్చి పంపెయ్యడంకంటె మరోమార్గం కనిపించడం లేదు" నెరిసిన మీసాల మీదనుండి అనుభవం తొంగి చూసింది.

ఆయన నిర్ణయానికి ఆమె విస్తుపోయింది. అంతకంటె బాధపడింది. ఇంతలో 'పోస్ట్' అనే కేకతోబాటు ఓ కవరు వచ్చి లోపల పడింది. ఆయన కవరు తీసి ఫ్రమ్ ఎడ్రసు చూశాడు, నవీన్ దగ్గిరనుండి. ఆత్రంగా చదవసాగారు.

పూజ్యులు ప్రధానోపాధ్యాయులవారికి-

నమస్కృతులు - కొన్ని విషయాలు నిన్న మీ ఎదట ధైర్యంగా చెప్పలేకపోయాను. అది నా బలహీనత - లేదా మీ యెడల ఉన్న భయంవలన కావచ్చు ఏమైనా ఇప్పుడు మరో ముఖ్యాంశం నేను చెప్పదలచుకున్నవాటికి జోడించి ఈ సుదీర్ఘమైన లేఖ వ్రాస్తున్నాను. దయచేసి పూర్తిగా చదవండి. చదివిన తర్వాత కూడా నన్ను నమ్మకపోతే క్షమించండి చాలు—

అసలు విషయం వ్రాసేముందు నా గురించి కొంత పరిచయం అవసరమనుకుంటాను. చిన్నప్పుడే సర్వస్వం కోల్పోయిన అభాగ్యుణ్ణి. లేదా లోకం దృష్టిలో పుట్టుకతోనే తల్లిదండ్రులను సాగనంపాను. మా చిన్నాన్నగారి సంరక్షణలో చదువుకుంటున్నాను. చిన్నప్పటి నుండి సాహిత్యమంటే చెవి కోసుకునే వాణ్ణి. ఆ ప్రభావమే నాలో కొన్ని ఆశయాలను రేకెత్తించిందేమో! బూజుపట్టిన బూర్జువా భావాలను తుడిచిపెట్టి సమాజంలో విశాల దృక్పథాలను కలిగించాలనే పేరాశ నాకుండేది అందుకనుగుణంగానే ప్రవ




ర్తించేవాడిని స్కూలు జీవితంలో కూడా. ఆ ప్రత్యేకత కొందరికి నా పట్ల దురభిప్రాయాలను కలిగించినట్టు నాకు తెలుసు. అయినా నేను లెక్కచెయ్యలేదు. అదృష్టవశాత్తు విశాల - క్షమించాలి, అలవాటయిపోయింది. విశాలాక్షి ఇక్కడికి రావడం, ఆమె కూడా నా కోవకు చెందిన భావాలుగల వ్యక్తి కావడం జరిగాయి. అందుకే ఆమె అంటే నాకంత అభిమానం. ఆమెను కేవలం నా స్నేహితురాలుగానే చూసాను. కావాలంటే కృష్ణమూర్తిగారిలా నేను కూడా చెల్లాయి మొదలైన పదాలతో పిలువగలను. కేవలం బంధుత్వం రాలూకు తీయని పదాలతోనే ఆత్మీయత వస్తుందనుకోవడం పొరపాటు. నిజానికి బంధుత్వం కంటె ప్రియమైనది, మహత్తరమైనది స్నేహమని నా అభిప్రాయం. అరుదుగా లభించే మంచి స్నేహితులకంటె జీవితంలోకావలసిందేదీ లేదనుకుంటాను నేను. మాస్నేహాన్ని అపార్థం చేసుకొన్న విద్యార్థులు అల్లరి పెట్టినా నేను లెక్కచెయ్యలేను. ఆమె మానసిక ధైర్యం చూసి మరింత సంతోషించాను. ఆమె రచనలు, భావాలు మా సన్నిహితత్వానికి దారితీసాయి. ఒకరోజు ఆమెతో అర్జెంట్‌గా మాట్లాడవలసిన పనుండి ఇంటికి వెళ్ళాను. ఆమె ట్యూషన్‌కి వెళ్ళిందని చెప్పారు. కృష్ణమూర్తి మాష్టారు ఆమెకు ట్యూషన్ చెపుతున్నారని తెలిసి అక్కడకు వెళ్ళాను. నేను వెళ్ళేటప్పటికి తలుపులు గడియ పెట్టి ఉన్నాయి. లోపలనుండి ఏవో కేకలు వినిపిస్తున్నాయి. అనుమానించి తలుపు గట్టిగా తట్టాను. ఆయన కంగారుగా తలుపు తీసారు.ఎదురుగా భయాందోళనలతో నిల్చున్నవిశాల నన్నుచూసి బావురుమంది. సమయానికి నేను వెళ్ళకపోతే అతని పశు కామాగ్నికి అన్నెం పున్నెం ఎరుగని ఆ అమాయకురాలి జీవితం బలై ఉండేది. భార్య పుట్టింటికి వెళ్ళినప్పుడు ఎవ్వరూలేని అవకాశం చూసుకొని ఆడపిల్లను ట్యూషన్‌కి పిల్చి ఆయన తలపెట్టిన ఘనకార్యం అది. చెల్లాయని పిలిచే ముప్పయ్యేళ్ళు నిండిన విద్యావంతునిలో ఇంత నీచమైన అభిప్రాయం దాగుంటుందని, శ్రీరంగనీతులు చెప్పేవారి చరిత్రలిలా ఉంటాయని ఆమె ఊహించలేదు ఆ క్షణం ఆయన్ని చూస్తే నాకసహ్యమనిపించింది. ఏదో సమర్థించుకోబోయాడు. అతని సంజాయిషి వినకుండా తీవ్రంగా మందలించి ఆమెను తీసుకువెళ్ళి ఇంటిదగ్గర దిగబెట్టాను. ఆ విషయం మాత్రం సుబ్బారావుగారితో కూడా చెప్పొద్దన్నాను ఆరోజునుంచి ఆమె ట్యూషన్‌కి వెళ్ళడం మానేసింది. కృష్ణమూర్తిగారు సుబ్బారావుగారికి కబురు పంపించి ఆమెను నేను మోసం చేస్తున్నానని, నాతో కలిసి తిరుగుతూ ఆమె ట్యూషన్‌కి రావడం లేదని చెప్పారట. సుబ్బారావుగారు ఆమెపై కోప్పడితే తనకు ట్యూషన్ అక్కరలేదని చెప్పారట. దానితో ఆయనకు నాపై అనుమానం ధృవపడింది. కృష్ణమూర్తిగారు నీడను చూసి భ్రమపడ్డారు. నేను అసలు విషయం రచ్చకెక్కిస్తానని భయపడ్డారు. బహుశా సుబ్బారావుగారికి వచ్చిన ఉత్తరాలు ఆయన ప్రోత్సాహమే అయిఉండాలి. సుబ్బారావుగారు, కృష్ణమూర్తిగారు పెట్టిన గడుపు రేపేననుకుంటాను, రేపటితో ఈ సమస్య పరిష్కారం కావాలి. మీరేం చెయ్యగలరో నాకు

తెలుసు. అంతకంటే ముందు సమస్య లేకుండా చేసి వెళ్ళిపోతున్నాను. నా అనే వాళ్ళులేకపోయినా కనీసం నన్నర్థం చేసుకోలేనివాళ్ళమధ్య నేను జీవించి ప్రయోజనమేమిటి? అందుకే కొన్నాళ్ళపాటు ఈ లోకాన్ని చూసి వద్దామని వెళ్ళిపోతున్నాను. అంతకంటే స్నేహితురాలిగా విశాల క్షేమం కోరి ఆమెకు నేను చెయ్యగలిగిన సహాయమేదైనా ఉంటే ఇదే ననుకొని వెళ్ళిపోతున్నాను. స్నేహంకోసం త్యాగం (అనుకుంటే) చెయ్యడంకంటె అదృష్టం మరెక్కడుంది? అందుకు గర్విస్తున్నాను. కాని విశాలవంటి మంచినేస్తాన్ని విడిచి పెట్టి వెళ్లిపోతున్నందుకు బాధమాత్రం లేకపోలేదు. ఒక్క కోరిక. విశాలనర్థం చేసుకొని ఆమె అభివృద్ధికి సహకరించండి. ఆమె వెలుగులోకి వస్తుంది-అప్పుడుపొందే తృప్తికంటె మీ జీవితానికి కావాలసిందేముంటుంది?

వెళ్ళపోయేముందు మీ పెద్దతనాన్ని ధిక్కరిస్తున్నాననుకోకపోతే రెండుమాటలు ....నాటిక ప్రదర్శనకు మీరెందుకు విముఖత చూపారో, ఇప్పుడుకూడా మిగతావారితో బాటు నన్నెందుకు అర్థం చేసుకోలేకపోయారో ఆలోచిస్తే మీలో ఇంకా ఛాందసత్వం పోలేదనిపిస్తుంది. సుబ్బారావుగారు మాత్రం?-నాకూ విశాలకూ మధ్య ఆయన ఊహించిన సంబంధం మమ్మల్నిద్దరినీ దిగ్భ్రాంతులను చేసింది. మా ఇద్దరిమధ్య రక్తసంబంధంకంటె పవిత్రమైన అనుబంధం మొదటి పరిచయంలోనే ఏర్పడింది. ఇంతకంటె మా ఆత్మీయతను మాటల్లో ఎలా వ్యక్తం చెయ్యాలో తెలీడంలేదు___ నేనేం రచయితను కాను. అయినా వయసులోఉన్న యువతీ యువకుల మధ్యఉన్న సంబంధాన్ని 'వాంఛ' 'ప్రేమ' మొదలైన పదాలతో తప్పిస్తే మరోకోణంచూడలేని సంకుచితత్వం సంఘంలో ఆచారమైపోయింది. ఆ అమ్మాయిని అదేవయస్సులో వున్న అబ్బాయిలా చూసి స్నేహం చెయ్యగల మానసిక బలం మన విద్యార్థుల్లో లేకపోవడం శోచనీయం. పెద్దలుకూడా యువతీ యువకుల సంబంధాల్ని అర్థం చేసుకుంటున్న తీరు యువక ఆలోచనల్ని పెడదారులు పట్టిస్తోంది, ఈ కలుషిత వాతావరణానికి పరోక్షంగా పెద్దలే కారణమని నా అభిప్రాయం. విద్యావంతులైన మీరు కూడా....? నిర్మలమైన స్నేహానికి స్త్రీ పురుష జాతిమత వివక్షత లేమిటో?___ సృష్టిలో స్నేహం కంటె మధురమైనదీ విశాలమైనదీ మరేముంది? సృష్టి, సముద్రం, వెన్నెల, ఆకాశం మొదలైన వాటి లోతు కనుక్కోవాలనుకోవడం గీతలు గియ్యడం అవివేకం.

ఆవేశంలో ఏవేవో వ్రాశాను-క్షమించాలి. ఇప్పుడైనా నన్ను సమ్మండి. ఎప్పుడైనా తిరిగి కలుసు కుంటాను. (గలనని అనుకుంటాను.) సెలవ్

భవదీయ,

నవీన్.

ఉత్తరం మడిచి జేబులో పెట్టుకొని బరువెక్కిన హృదయంతో ఆయన బయటకు నడిచాడు, శాంత ఆశ్చర్యంగా చూసింది. వెళ్తున్న ఆయన గుమ్మందగ్గర ఆగి యాధృచ్ఛికంగా పైకి చూశాడు___ వెక్కిరిస్తున్నట్లు అనంతమైన ఆకాశం నిండా వెల్లివిరిసిన చల్లని వెన్నెల! ●